ఇదీ మా మాట..

గోషామహల్, నాంపల్లి నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, ఏఐఎంఐఎం, కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతోంది. మీకే ఎందుకు ఓటు వేయాలని ప్రధాన పార్టీ అభ్యర్థులను ప్రశ్నించగా ప్రజా సేవ, అభివృద్ధి, తమ పార్టీ అమలుచేయబోయే సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని స్పష్టం చేస్తున్నారు.

అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తా..



తనను గెలిపిస్తే గోషామహల్ ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా. 25 సంవత్సరాలుగా గోషామహల్ నియోజకవర్గంలో ఆదిత్య ట్రస్ట్ స్థాపించి ఏ ప్రజా ప్రతినిధులు చేయని సేవా కార్యక్రమాలు చేశా. కరోనాలో సైతం 50 వేల మంది గోషామహల్ ప్రజలకు 60 రోజుల పాటు బియ్యం, నిత్యావసర సరుకులు, మాస్కులు ఇంటింటా పంపిణీ చేశా. పదేళ్లుగా నియోజకవర్గంలో బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. తనను గెలిపిస్తే గచ్చిబౌలి తరహాలో గోషామహల్‌ను అభివృద్ధి చేస్తా. మంత్రి కేటీఆర్ కూడా గోషామహల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా గోషామహల్‌లోనే కార్యాలయం ఏర్పాటు చేసి నిరంతరం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నా. ఒక్కసారి తనకు ఓటువేసి గెలిపిస్తే గోషామహల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా.

– నందకిశోర్ వ్యాస్ బిలాల్, బీఆర్‌ఎస్

పదేళ్ల అభివృద్ధితోనే విజయం సాధిస్తా..



పదేళ్లలో తాను చేపట్టిన అభివృద్ధితోనే మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ పొందుతా. నియోజకవర్గంలోని ధూల్‌పేట్‌లో 24 గంటలు ఉంటూ ప్రజలకు నిరంతరం సేవలందించా. ప్రజలు ఎలాంటి కష్టాలు ఉన్నా వెంటనే తీర్చాను. తాను చేపట్టి అభివృద్ధితోనే అన్నివర్గాల ప్రజలు ఆదర్శిస్తున్నారు. ఎక్కడ వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ పథకాలు తన విజయానికి సోపానలవుతాయి. గోషామహల్‌లో పదేళ్లలో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేశా. తన అభివృద్ధిని చూసి మరోసారి గెలిపిస్తారు. మౌలిక వసతుల రూపకల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చా.

– రాజాసింగ్, బీజేపీ

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం..



కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజల కోసం ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం. రూ.500 లకే ప్రతి ఒక్కరికి గ్యాస్ సిలిండర్‌ను అందిస్తాం. బీజేపీ ప్రభుత్వం రూ.1200 లకు సిలిండర్‌ను ఇస్తే తాము రూ.500 లకే ఇచ్చి ప్రజలకు అండగా నిలుస్తాం. కాంగ్రెస్‌తోనే పేద, బడుగువర్గాల అభివృద్ధి జరుగుతుంది. ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంటును ఉచింగా ఇస్తాం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. ఇందిరమ్మ రాజ్యంతోనే గోషామహల్ అభివృద్ధి జరుగుతుంది. పదేళ్లుగా గోషామహల్‌లో బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయన్నందుకే ప్రజలు తనను గెలిపిస్తారు. తాను గెలిచిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేసి ప్రజలకు అండగా ఉండి అభివృద్ధి చేస్తాం.

– మొగిలి సునీతారావు, కాంగ్రెస్

ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తాం..



బీఆర్‌ఎస్ ప్రభుత్వం సెంటిమెంట్ మంత్రంతో అధికారంలోకి వచ్చింది. ఆంధ్రా, తెలంగాణ అనే విభజన సెగను అడ్డం పెట్టుకుని రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చింది.పైగా నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదాన్ని సాకుగా చూపి ప్రజల ఓట్లను కొల్లగొట్టారు. కొత్త రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలో అందరికీ అవకాశాలు వస్తాయని అధికారమిస్తే తొమ్మిదన్నరేళ్లలో ప్రజలకు చేసిందేమి లేదు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని కాదని ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపించి పశ్చాత్తాపం చెందారు. అంతేకాకుండా ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం అవినీతిలో కూరుకుపోయింది. ప్రభుత్వ వైఫల్యాలు పూర్తిగా బట్టబయలు అయ్యాయి. మూడోసారి బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇస్తే కేసీఆర్ రాష్ట్రాన్ని అమ్మేస్తారు. కాబట్టి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలి. కాంగ్రెస్ అవకాశం ఇస్తే ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తాం.

– మహ్మద్ ఫిరోజ్ ఖాన్, కాంగ్రెస్

అభివృద్ధి చేశాం.. గెలిపించండి



పాతబస్తీ అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోంది. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో ఏడు నియోజకవర్గాల్లో ఎంతో పురోగతిని సాధించాం. ఎస్‌ఆర్‌డీపీ నిధులను అత్యధికంగా ఖర్చు చేశాం. గడచిన ఐదేళ్లలో ఒక్కో నియోజకవర్గంలో రూ.250 కోట్లతో అభివృద్ధి జరిగింది. 82 బస్తీ దవాఖానాలు పనిచేస్తున్నాయి. 201 రెసిడెన్సియల్ స్కూల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల్లో రూ.290 కోట్లతో సీవరేజ్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో నాలాల విస్తరణ పనులు పూర్తి చేశాం. నాంపల్లిలో రూ.80 కోట్లతో అదనపు కేన్సర్ ఆస్పత్రిని ప్రారంభించుకున్నాం. రూ.40 కోట్లతో నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో అదనపు పడకలు, అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసువచ్చాం. చారిత్రాత్మక నగరాన్ని మరింత అభివృద్ధి చేయడానికి మజ్లిస్‌కు ఓటు వేయాలి.

– మాజిద్ హుస్సేన్, ఏఐఎంఐఎం

అభివృద్ధి చేశాం మరింతా చేస్తాం..



గడచిన తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలనే కాకుండా ఇంకా ఎన్నో కొత్త పథకాలను ప్రవేశపెట్టాం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం దేశంలో మరెక్కడా జరగలేదు. దళితబంధు, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, రంజాన్ తోఫా, బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ , వసతి గృహాల్లో సన్నబియ్యం, కేసీఆర్ కిట్ వంటి పథకాలకు మంచి ఆదరణ వచ్చింది. కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్ల పంపిణీ చేశాం. ప్రతి ఇంటిలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు, కిట్లు వంటి ఏదోకటి అందుతున్నాయి. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే మాకు శ్రీరామ రక్షగా నిలుస్తాయి. మరోసారి అవకాశం కల్పించి గెలిపిస్తారు.

– ఆనంద్‌కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తా..



నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలన్నింటీ శాశ్వతంగా పరిష్కరిస్తా. రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజలకు చేసిందేమి లేదు. కేంద్రం ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చే పథకాలన్నీ బీజేపీ పథకాలే. పేదలకు దొడ్డు బియ్యం కూడా ఇవ్వలేని స్థితిలో ఉంది. మూడోసారి గెలిపిస్తే సన్నబియ్యం ఇస్తానంటూ గొప్పలు చెప్పున్నారు. ఇప్పుడు ఇవ్వలేని కేసీఆర్ మళ్లీ ఎలా ఇస్తారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే బాగుంటుంది. నిధులు సమృద్ధిగా వస్తాయి. కావాల్సినంత అభివృద్ధిని, సంక్షేమ పథకాలను అమలు చేసుకోవచ్చు. అందుకే డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ బీజేపీని గెలిపించాలి.

– రాహుల్‌చంద్ర, బీజేపీ

ఓటు వజ్రాయుధం లాంటిది: ఎమ్మెల్యే కౌసర్



దెక్కన్ ఇంటలెక్చువల్స్ ప్రతినిధులతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఓటు వజ్రాయుధం లాంటిదని ఓటు హక్కు ఉన్న వారు తమ ఓటును ఎంతో ఆలోచించి వేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం నానల్‌నగర్ క్రిస్టల్ టవర్స్ బ్లాంకెట్ హాల్‌లో డెక్కన్ ఇంటెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో మై ఓట్-మై రైట్ అనే కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటు హక్కు వినియోగం, ఓటు విలువపై మేధావులు, ముఖ్యంగా డెక్కన్ ఇంటలెక్చువల్స్ ఫోరం వారు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు బద్దర్‌ఉద్దీన్, ఫోరం ప్రతినిధులు సయ్యద్ ఆరీఫ్, సయ్యద్ షాబాజ్ అహ్మద్ ఖాద్రీ, మహ్మద్ ఇదాయత్ అలీ ఖాన్, సోహెల్ తదితరులున్నారు.

తండ్రీ కుమారుల ముమ్మర ప్రచారం



మజ్లిస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం రాజేశ్వర్‌రావు,దీపేష్ రాజ్ వర్మ

చార్మినార్: పాతబస్తీ దూద్‌బౌలికి చెందిన సీనియర్ మజ్లిస్ పార్టీ నాయకులు తండ్రీకుమారులు రాజేశ్వర్‌రావు, ఆర్.దీపేష్ రాజ్ వర్మ మజ్లిస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం నిరంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొని చార్మినార్, బహదూర్‌పురా, మలక్‌పేట్, యాకుత్‌పురా, నాంపల్లి తదితర నియోజకవర్గాల అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచిపెడుతూ పతంగ్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. శనివారం చార్మినార్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫికర్ అలీతో కలిసి చార్మినార్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పాతబస్తీలో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారన్నారు.

బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల అడ్మిషన్లపై గందరగోళం

కోఠి డీఎంఈ కార్యాలయం వద్ద ఆందోళన

సుల్తాన్‌బజార్: కాళోజీ నారాయణరావు హెల్త్ విశ్వవిద్యాలయం (కేఎన్‌ఆర్) సుమారు 2 వేల మంది బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని బాధిత విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కోఠిలోని డీఎంఈ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ..బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్లకు ఈనెల 30న చివరి తేదీ కావడంతో 2 వేల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదకరంలో ఉందన్నారు. కన్వీనర్ కేటగిరి, మేనేజ్‌మెంట్ కేటగిరి ఒకే రకమైన అడ్మిషన్ నిబంధనలు వర్తింపచేయాలని విద్యార్థులు కేఎన్‌ఆర్ విశ్వవిద్యాలయ అధికారులను కోరారు. యూనివర్సిటీ ఈనెల 22న టీఎస్ ఎంసెట్ క్వాలిఫై అయిన విద్యార్థులు సున్నా శాతం సడలింపుతో కన్వీనర్ కేటగిరికి మాత్రమే అర్హులని, మేనేజ్‌మెంట్ కేటగిరి సీట్లకు అర్హులు కాదని పేర్కొంటూ సర్క్యులర్ జారీ చేసిందని వారు తెలిపారు. మేనేజ్‌మెంట్ కేటగిరి విద్యార్థులు తప్పనిసరిగా సున్నా శాతం సడలింపుతో నీట్ అర్హత మాత్రమే కలిగి ఉండాలని జారీ చేసి ఈనెల 30న అడ్మిషన్ల ప్రక్రియను చివరి రోజుగా తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం కన్వీనర్, మేనేజ్‌మెంట్ కేటగిరి రెండింటికి ఒకేవిధమైన అడ్మిషన్ నిబంధనలను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు.

బీజేపీ అభ్యర్థికి ఎమ్మార్పీఎస్ మద్దతు



బీజేపీ అభ్యర్థితో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చాంద్రాయణగుట్ట: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియకు ప్రధాని మోదీ అంగీకారం తెలిపిన నేపథ్యంలో చాంద్రాయణగుట్ట ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీ అభ్యర్థి కౌడీ మహేందర్‌కు మద్దతు తెలిపారు. చాంద్రాయణగుట్ట, చార్మినార్ ఇన్‌చార్జి ఎస్.ఎం.నర్సింహస్వామి మాదిగ శనివారం ఉప్పుగూడ, భానోదయం సంఘం ప్రాంతంలో బీజేపీ అభ్యర్థితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కౌడీ మహేందర్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ చేసేందుకు నరేంద్ర మోదీ చొరవ తీసుకున్నారన్నారు. రమేష్, చిరంజీవి, పండరీ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీటీని గెలిపించండి



అంజదుల్లాఖాన్‌తో కలిసి ప్రచారం చేస్తున్న బుంగ శివకుమార్

చార్మినార్: దశాబ్దాలుగా యాకుత్‌పురా నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ హుకుం చెలాయుస్తున్నప్పటికీ.. ఎక్కడ ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని.. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో ఎంబీటీని గెలిపిస్తే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని యాకుత్‌పురా ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లాఖాన్ అన్నారు. సీనియర్ ఎంబీటీ నాయకులు బుంగ శివకుమార్‌తో కలిసి ఆయన ఉప్పుగూడ, దానయ్యనగర్, మంగళ్‌ముఖీ హనుమాన్ టెంపుల్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ ఎన్నికలలో తమ పార్టీకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పాదయాత్రకు విశేష స్పందన



నాంపల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోంది. దారిపొడవునా ప్రజలు ఆనంద్‌కుమార్ గౌడ్ నీరాజనాలు పట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్తీల్లో తిరుగుతూ అభ్యర్థి అభివాదం చేశారు. నియోజకవర్గంలోని శాంతినగర్, హరిజన్ బస్తీ, సాయినగర్ కాలనీలో గడపగడపకూ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం: అలీ మస్కతి



చార్మినార్: తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తుండడంతో ఈసారి తమ ప్రభుత్వం ఖాయమని తెలంగాణ రాష్ట్ర కాంపేయిన్ అండ్ ప్లానింగ్(ప్రచారం, ప్రణాళికా) కమిటీ కన్వీనర్ అలీ మస్కతి ధీమా వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన అన్ని వర్గాల ప్రజలు ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో తమ పోటీ కేవలం బీఆర్‌ఎస్‌తోనే ఉంటుందన్నారు.

జూపార్కులోని లంగూర్ దత్తత

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కు సందర్శనకు వచ్చిన జి.ప్రవీణ్ వర్మ, హిమబిందు దంపతులు నార్తర్న్ ప్లెయిన్స్ గ్రే లంగూర్‌ను 9 నెలల పాటు దత్తత తీసుకున్నారు. దత్తతకు సంబంధించిన రూ.75 వేల నగదును జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్ హిరేమత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుటుంబసభ్యులు జూలోని లంగూర్ ఎన్‌క్లోజర్‌ను సందర్శించి జూ యాజమాన్యం జంతువుల పరిశుభ్రత, నిర్వహణ, సంక్షేమంపై సంతోషం వ్యక్తం చేశారు. క్యూరేటర్ హిరేమత్ మాట్లాడుతూ..జూపార్కులోని వన్యప్రాణులను సామాజిక బాధ్యతగా దత్తత తీసుకునేందుకు పౌరులు, విద్యా సంస్థలు, కార్పొరేట్లు, బ్యాంకింగ్ రంగాలు ముందుకొచ్చి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అడవి జాతులను దత్తత తీసుకోవాలన్నారు. డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి, జూపార్కు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

చాంద్రాయణగుట్ట: యుగ తులసి పార్టీ చాంద్రాయణగుట్ట అభ్యర్థి ఆడాల కరుణ శనివారం లలితాబాగ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప్పుగూడ జెండా, రాఘవేంద్రస్వామి నగర్, నరహరినగర్‌లలో పార్టీ నాయకురాళ్లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ రోడ్డు రోలర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. మహిళా అభ్యర్థినైన తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు.

అబద్దాల బీజేపీకి చరమగీతం పాడాలి



ప్రచారం చేస్తున్న దామోదర్‌గుప్తా, పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: అబద్దాలు చెబుతూ పదేళ్లుగా గోషామహల్ అభివృద్ధిని విస్మరించిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ప్రజలు చరమగీతం పాడాలని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. బీజేపీ కేవలం మతం పేరుతో ఓట్లు దండుకుంటూ అభివృద్ధిని మరిచిపోతారన్నారు. మంగళ్‌హాట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం చైర్మన్ కోలేటీ దామోదర్‌గుప్తా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపిస్తే గచ్చిబౌలి తరహాలో మంత్రి కేటీఆర్ స్వయంగా గోషామహల్‌ను అభివృద్ధి చేస్తారన్నారు. బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, ఆనంద్ సింగ్, శౌరాజ్ సింగ్, బల్‌దీప్ సింగ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలి



ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్

బహదూర్‌పురా: నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ నియోజకవర్గంలోని ఫతేదర్వాజా, మోయిన్‌పురా, కుమ్మర్‌వాడీ, మిశ్రీగంజ్, చందులాల్ బారాదరి తదితర ప్రాంతాల్లో శనివారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని.. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చమరగీతం పాడాలని.. తెలంగాణ రాష్ట్రంలో నిజాయితీ పాలనకై కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. అబేద్ అలీ, నజీర్ ఖాన్, యాకుబ్, హరిబాబు, సుమన్ సూరిశెట్టి, అంబికా, జ్యోతి, నదీమ్, జబ్బార్ పాల్గొన్నారు.

వైభవంగా జ్వాలా తోరణం



లంగర్‌హౌస్: తులసీ నారాయణుల కల్యాణాన్ని భక్తులు వీక్షించి తరించారు. లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన జానకీ సమేత వీరవెంకట విజయరాఘవస్వామి ఆలయంలో పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో తులసీ లక్ష్మీ నారాయణుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తర్వాత కల్యాణ తులసీ లక్ష్మీనారాయణులను పల్లకీలో ఊరేగించారు. అనంతరం రాలీలా మైదానంలో జ్వాలా తోరణం వెలిగించి కింద నుంచి స్వామి అమ్మవార్లను పల్లకీలో తీసుకెళ్లగా భక్తులు జ్వాలా తోరణం కింద నుంచి ఈదారు. ఆలయ ప్రాగణంలోని ధ్వజ స్తంభానికి పండితులు రాజనర్సిహచారి, శ్రీనివాస్, రింకు శాస్త్రిలతో కలిసి రాహుల్‌దాస్ బాబా కార్తీక ఆకాశ దీపం సమర్పించారు.

యాకుత్‌పురాలో కమలం వికసించడం ఖాయం



ప్రచారంలో వీరేందర్‌బాబు యాదవ్, కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి వీరేందర్ బాబు యాదవ్ లాల్‌దర్వాజా, బాలాగంజ్, బాదం మసీదు, మక్కాంపురా తదితర ప్రాంతాల్లో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈసారి యాకుత్‌పురా నియోజకవర్గంలో కమలం పువ్వు వికసించడం ఖాయమన్నారు. రేణుక, శోభారాణి, సంధ్యరాణి, రజినీ, దశరథ్ లక్ష్మి, అనిత, సుమన్‌కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తా



చార్మినార్: ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే.. చార్మినార్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన తన అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గంలోని పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి కరపత్రాలను పంచిపెట్టి ఈ ఎన్నికలలో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

జంగ్ తెలంగాణ 2023

బీజేపీని చిత్తుగా ఓడించండి



ప్రచారం చేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: అక్రమాల బీజేపీని చిత్తుగా ఓడించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. పదేళ్లుగా గోషామహల్‌లో బీజేపీ అక్రమాలకు పాల్పడుతూ..ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. జాంబాగ్ పరిసర ప్రాంతాల్లో ఆయన ఇంటింటా తిరుగుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ..ప్రజలంతా బీజేపీతో విసిగి పోయారన్నారు. అభివృద్ధి చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ప్రభుత్వానికి ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో భజన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



ప్రచారంలో పాల్గొన్న రవిరాజ్

గౌలిపురా: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం యాకుత్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.రవిరాజ్ బాలాగంజ్ తదితర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, నాయకులు కృష్ణకుమార్, రాజు యాదవ్, మామిడాల శ్రీనివాస్, పవన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం మజ్లిస్ పార్టీకే సాధ్యం



మాట్లాడుతున్న అక్బరుద్దీన్ ఒవైసీ

విజయనగర్‌కాలనీ: నాంపల్లి ఎంఐఎం అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మేరాజ్‌ను గెలిపించాలని శనివారం అక్బరుద్దీన్ ఒవైసీ ఆసిఫ్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసిఫ్‌నగర్‌లో అన్ని హంగులతో కూడిన కార్పొరేట్ ఆసుపత్రిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానన్నారు. ప్రజా సంక్షేమం మజ్లిస్ పార్టీకే సాధ్యమని పేర్కొన్నారు. సయ్యద్‌అలీ గూడ ఏరియా ప్రెసిడెంట్ మాజీద్ రజ్వి, మహ్మద్ మహమూద్‌భాయి, ఆతిక్, అశ్వక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక విద్యతో సత్ప్రవర్తన



గోల్కొండ: ఆధ్యాత్మిక విద్యతో సత్ప్రవర్తన అలవరుతుందని అఖిల భారత హీరత్ కమిటీ అధ్యక్షుడు ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. శనివారం గోల్కొండ రిసాల బజార్‌లోని ఇస్లామిక్ ఆధ్యాత్మిక కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆయన ఆధ్యాత్మిక బోధనల అవశ్యకతలను వివరించారు. ఆధ్యాత్మిక బోధన కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు తమ జీవితాన్ని సరైన మార్గంలో మళ్లించుకుంటారని ఆయన అన్నారు. తమ తల్లిదండ్రుల ఆశీర్వాదంతో పిల్లలు తమ లక్ష్యాలను చేరుకోవడంలో విజయం సాధిస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో హమీద్, హెహేతషాం పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రాన్ని అందుకున్న కీర్తి రాకేష్ తదితరులు

జియాగూడ: ఖైరతాబాద్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా జియాగూడ ఇందిరానగర్‌కు చెందిన పంతుల్ కీర్తిరాకేష్ నియమితులయ్యారు. మహిళా కాంగ్రెస్ కమిటీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ శనివారం పంతుల్ కీర్తి రాకేష్‌కు నియామకపు పత్రాన్ని అందజేశారు. కీర్తిరాకేష్ మాట్లాడుతూ..కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ పరిధిలోకి వస్తుందని, ఈసారి అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అనుకూల ఫలితాలు వచ్చే సంకేతాలిస్తున్నాయని, దీన్నిబట్టి చూస్తే తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రాకేష్, గోవర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, రేణుక, పింకి పాల్గొన్నారు.

గోషామహల్‌లో బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తాన్‌బజార్: గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాపడిన ఘటన శనివారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ముత్తు తెలిపిన వివరాల ప్రకారం..ఇసామియాబజార్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు దిలీప్ ఘనాటే, సుల్తాన్‌బజార్ మాజీ కార్పొరేటర్ రామచందర్ రాజుల మధ్య జరిగిన వాగ్వాదం తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటన సాక్ష్యాత్తు గన్‌ఫౌండ్రీ డివిజన్‌లో రాయల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసుకున్న పార్టీ కార్యాలయంలో జరిగింది. శనివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో గోషామహల్‌లో ఉండడంతో జన సమీకరణలో భాగంగా రామచందర్ రాజు, దిలీప్ ఘనాటేల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దిలీప్ ఘనాటే రాంచందర్‌రాజును దుర్భాషలాడడంతో ఆయన అనుచరులు భవానీ మరికొందరు దిలీప్ ఘనాటేపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు దిలీప్ ఘనాటే కుమారుడు సాయితేజ సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించి మాజీ కార్పొరేటర్ రాంచందర్ రాజు, భవానీపై ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిపై 306, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

జియాగూడలో బైక్ ర్యాలీ



జియాగూడ: జియాగూడలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మిత్రకృష్ణ గెలుపుకోసం బైక్ ర్యాలీని కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైంది. ముఖ్యఅతిథిగా మిత్ర కృష్ణ తనయుడు మిత్ర అభిషేక్ హాజరై బైక్‌ర్యాలీ ఊరేగింపులో పాల్గొన్నారు. రంగ పరందాములు జెండా ఊపగా అధ్యక్షుడు నరహరిచారి, మహిళా అధ్యక్షురాలు నర్మద, సంగీత, శ్రీనివాస్ గుప్తా, హేమంత్‌కుమార్, సి.బాబు, దేవేందర్ సాగర్, ఉమేష్, మంతటి నర్సింహ, కేశవ్, శంకర్ సింగ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ టాప్

గోల్కొండ: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ టాప్ అని కార్వాన్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంచిపెట్టారు. తూమ్‌కుంట అరుణ్‌కుమార్, ఇమ్రాన్ అలీ ఖాన్ తదితరులున్నారు.